ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5

శ్రీకాకుళం
జిల్లా వార్తలు
గురువారం 28 నవంబరు 2024

మిగులు సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్ రేపు

ఎచ్చెర్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ యూనివర్సిటీలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను వివిధ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి శుక్రవారం స్పాట్ అడ్మిషన్ నిర్వహించనున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ పీజీ సెట్-2024 రాసి అర్హత సాధించని వారు, అలాగే సెట్‌కు హాజరుకాని అర్హత గల విద్యార్థులు స్పాట్ అడ్మిషన్లలో సీట్లు పొందవచ్చన్నారు. నిర్దేశించిన శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వర్సిటీలో అడ్మిషన్లు జరుగుతాయని చెప్పారు. అవసరమైన సర్టిఫికెట్లతో ఆసక్తి గల విద్యార్థులు హాజరుకావాలని కోరారు.

ఫెంగల్ అలజడి

- తుఫాన్ హెచ్చరికతో రైతుల్లో ఆందోళన
- పంట కాపాడుకునే పనిలో బిజీ
- జిల్లాలో రేపు, ఎల్లుండి వర్షాలు
- హెచ్చరించిన వాతావరణశాఖ
- అధికార యంత్రాంగం అప్రమత్తం


హరిపురంలో చేను మోపులను కల్లానికి తరలిస్తున్న మహిళలు..


బిన్నల వద్ద పొలాల్లోనే వరి కుప్పలు పెడుతున్న రైతులు


హరిపురం: పితాతొళి వద్ద పొలాల్లోనే ఉన్న వరి ఓదెలు

నరసన్నపేట/హరిపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి)

జిల్లా రైతాంగాన్ని ఫెంగల్ తుఫాన్ భయపెడుతోంది. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా మారింది. ఇది శుక్రవారం నాటికి తుఫాన్‌గా మారనుంది. దీని ప్రభావంతో జిల్లాలో శుక్ర, శనివారం మోస్తరు నుంచి అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావారణ శాఖ గురువారం హెచ్చరికలు జారీ చేసింది. దీంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ మేరకు గ్రామాల్లో దండోరా వేయిస్తున్నారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పర్యటిస్తూ ప్రజలు, రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. వరి కోతలు కోయవద్దని, ఇప్పటికే కోసిన పంటను, ధాన్యాన్ని జాగ్రత్త చేసుకోవాలని సూచిస్తున్నారు. మత్స్యకారులు చేపల వేటకు సముద్రంలోకి వెళ్లకుండా ఆంక్షలు విధించారు.

రైతుల్లో ఆందోళన..

తుఫాన్ హెచ్చరికలతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో సుమారు 3.65 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇప్పటికే 2.2 లక్షల ఎకరాల్లో కోతలు, 1.02 లక్షల ఎకరాల్లో నూర్పులు పూర్తయ్యాయి. ధాన్యం రాశులను రోడ్లపై, కళ్లాల్లో ఆరబెడుతున్నారు. అయితే, మంగళవారం నుంచే ఆకాశం మేఘావృతం కావడంతో రైతులు ధాన్యాన్ని భద్రపరుచుకుంటున్నారు. ఇంకా కొనుగోలు ప్రారంభంకాకపోవడంతో కొందరు రైతులు దళారులకు పంటను విక్రయిస్తున్నారు. వంశధార ఎడమ కాలువ పరిధిలోని జలుమూరు, నరసన్నపేట, పోలాకి మండలాల్లో వరి కోతలు నిలిపివేశారు. ఈ మూడు మండలాల్లో 15 వేల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. పనలు పూర్తి స్థాయిలో


జమ్ములో దండోరా వేస్తున్న దృశ్యం


నరసన్నపేట: జమ్ము వద్ద నూర్పు చేసి గింజలను చక్కబెడుతున్న దృశ్యం

ఎండనప్పటికీ వాటిని హడావుడిగా కుప్పలు వేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో కుప్పలు వేయకుండానే నేరుగా నూర్పు చేస్తున్నారు. వర్షం కురిసినా పంట తడవకుండా ఉండేందుకు టార్పాలిన్లు కప్పుతున్నారు. ● మందస ప్రాంతంలో డాబార్సింగి, కలింగదల్, దామోదర సాగర్‌లతో పాటు సునాముది, మహేంద్రతనయా నది, సంకుజోడి, గోపాల సాగరం వంటి పెద్ద సాగునీటి వనరుల కింద సుమారు 10 వేల హెక్టార్లలో వరి పంట కోత దశకు చేరుకుంది. సగానికి పైగా పొలాలు కోతలు కోసి ఉండడంతో ఎక్కడ కుప్పలు పెట్టాలి, ఏమిచేయాలో పాలు పోవడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. మందస మండలంలో ఏ గ్రామం వెళ్లి చూసినా పొలాల్లో రైతులు, కుప్పలు వేస్తున్న దృశ్యాలే కన్పిస్తున్నాయి.

అవినీతికి పాల్పడితే కేసులే!

- పకడ్బందీగా ఉపాధి హామీ పథకం
- అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు
- విజిలెన్స్ విభాగానికి చీఫ్ నియామకం
- గత వైసీపీ ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా పనులు
- పక్కదోవ పట్టిన నిధులు

మెళియాపుట్టి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధి పనుల్లో అవినీతి జరిగినా అడిగే నాథుడు కరువయ్యాడు. ఐదేళ్ల పాలనలో వైసీపీ నేతలతో అధికారులు కుమ్మక్కై వారు ఆడిందే ఆట.. పాడిందే పాటగా ఉపాధి పనులు సాగాయి. ఫలితంగా కొంత మంది వైసీపీ నేతలు, ఉపాధి సిబ్బంది లక్షలాది రూపాయల అవినీతికి పాల్పడ్డారు. ఈ అవినీతిని వెలికితీసే కీలకమైన విజిలెన్స్ విభాగాన్ని జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. అయితే, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఉపాధి పనులపై ప్రత్యేక దృష్టిసారించింది. పనుల్లో అవినీతిని కట్టడి చేసేందుకు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కృతనిశ్చయంతో ఉన్నారు. ఇందులో భాగంగా విజిలెన్స్ చీఫ్‌గా పోలీస్ అధికారిని నియమించారు. గత ఐదేళ్లలో జరిగిన సోషల్ ఆడిట్, రికవరీకి సంబంధించిన వివరాలను ఇవ్వాలని విజిలెన్స్ చీఫ్ ఆదేశించినట్లు తెలిసింది. దీంతో అవినీతి పరుల గుండెల్లో రైళ్లు పరుగెత్తున్నాయి. జీవో నెంబర్ 52 ప్రకారం ఉపాధి పథకంలో రూ.లక్షకు మించి అవినీతికి పాల్పడిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ చేయాల్సి ఉంటుంది. గత వైసీపీ ప్రభుత్వంలో అవినీతికి పాల్పడిన ఉపాధి సిబ్బందిపై ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. గతంలో జిల్లాలో కొంతమంది ఫీల్డ్‌అసిస్టెంట్లు బినామి వేతనదారుల పేర్లతో అధికంగా నిధులను పక్కదోవ పట్టించారు. అయినా వారిపై ఎలాంటి చర్యలు లేవు. కొంత మంది పట్టుబడినా మండల, జిల్లా స్థాయి అధికారులను మేనేజ్ చేసి తప్పించుకున్నట్లు విమర్శలు ఉన్నాయి. అయితే, కూటమి ప్రభుత్వం మాత్రం ఇలాంటి వారిపై కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. అక్రమాలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశాలు ఇచ్చింది. దీంతో అవినీతిపరుల్లో ఆందోళన నెలకొంది.

● మెళియాపుట్టి మండలం పెద్దలక్ష్మీపురం సచివాలయ భవన నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారు. వేల రూపాయల అవినీతి చోటుచేసుకుంది. ఈ విషయాన్ని ఇటీవల గ్రామస్థాయిలో జరిగిన సోషల్ ఆడిట్‌లో ప్రజలకు వివరించారు. అయితే, మండల స్థాయిలో జరిగిన గ్రామసభలో మాత్రం ఆ విషయాన్ని ప్రస్తావించలేదు. ఆ అవినీతి బహిర్గతం కాకుండా ఓ వైసీపీ నాయకుడు ప్రధాన భూమిక పోషించాడు.

● మెళియాపుట్టి మండలంలో ఇటీవల సోషల్ ఆడిట్ జరిగింది. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేదని, వివిధ గ్రామాల్లో రూ.1.50కోట్లతో చేపట్టిన పనుల్లో లోపాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. పనుల ఎస్టిమేట్‌లో అదనంగా టాస్క్ గుర్తించారు. మొక్కల పెంపకంలో రూ.3,66,679 పక్కదారి పట్టినట్లు వెలుగు చూసింది. కానీ, సంబంధిత సిబ్బందిపై చర్యలు శూన్యం.


మెళియాపుట్టిలో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు(ఫైల్)

జిల్లాలో పరిస్థితి..

జిల్లాకు గత నాలుగేళ్లలో అధికంగా కేంద్రం నుంచి ఉపాధి నిధులు వచ్చాయి. కొంతమంది వైసీపీ నాయకులు అధికంగా మెటీరియల్ కాంపోనెంట్ నిధులను తమకు అనుకూలంగా ఉన్న గ్రామాలకు మళ్లించి అవినీతికి పాల్పడినట్లు విమర్శలు ఉన్నాయి. 2021-22లో 2.18 కోట్ల పని దినాలు కల్పించగా రూ.428.53 కోట్లను వేతనాలు ద్వారా చెల్లించారు. మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.634.71 కోట్లు ఖర్చు చేశారు. ఇందుకు సంబంధించి సోషల్ ఆడిట్‌లో రూ.24.55 లక్షలు పక్కదోవ పట్టినట్లు అధికారులు గుర్తించారు. 2022-23లో రెండు లక్షల పనిదినాలకు గాను రూ.381.75 కోట్లు వేతనాలు చెల్లించారు. మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.584.75 కోట్లు ఖర్చు చేయగా, రూ.17.67 లక్షల అవినీతి జరిగినట్లు ఆడిట్‌లో గుర్తించారు. 2024లో ఇప్పటివరకు 2.18 లక్షల పని దినాలు కల్పించగా, వేతనాలు కింద రూ.549.70 కోట్లు, మెటీరియల్ కోసం రూ.707.17 కోట్లు ఖర్చు చేశారు. ఈ పనుల్లో రూ.10.26 లక్షల అవినీతి చోటుచేసుకుంది. గత నాలుగేళ్లలో 1,609 మంది సిబ్బంది అక్రమాలకు పాల్పడినట్లు అధికారులు గుర్తించి వారి నుంచి రూ.67.04 లక్షలు రికవరీ చేశారు.

అవినీతి కట్టడి జరిగేనా?

కొంతమంది ఉపాధి సిబ్బంది ఏదో ఒక పార్టీకి కొమ్ముకాస్తున్నారు. ఎవరు అధికారంలో ఉంటే వారికే జై కొడుతున్నారు. దీంతో వారు అవినీతికి పాల్పడినా నాయకులు కాపాడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొంతమంది జిల్లాస్థాయి అధికారులు కూడా సిబ్బందికి సహకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఆడిట్ జరిగిన సమయంలో రూ.2 లక్షల నుంచి రూ.3లక్షల వరకు డిమాండ్ చేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. దీనివల్ల అవినీతి సిబ్బంది తప్పించుకుంటున్నారు. కూటమి ప్రభుత్వంలో ఈ అవినీతికి చెక్ పడుతుందో లేదో చూడాలి.

అమ్మో.. కొండచిలువ

- టిడ్కో గృహాల్లోకి చొరబడిన 12 అడుగుల సర్పం
- చాకచక్యంగా పట్టుకొని అడవిలో విడిచిపెట్టిన స్నేక్‌క్యాచర్


కొండచిలువను పట్టుకున్న దృశ్యం

పలాస, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పలాస కోసంగిపురం జాతీయ రహదారి వద్ద నిర్మాణంలో ఉన్న టిడ్కో గృహ సముదాయంలోకి 12 అడుగుల పొడవు గల భారీ కొండచిలువ చొరబడింది. మంగళవారం రాత్రి ఈ గృహాల వద్ద పనిచేస్తున్న కార్మికులకు ఈ పాము తారసపడింది. దీంతో వారంతా కేకలు వేస్తూ పరుగులు పెట్టారు. దీంతో కొండచిలువ వ్యర్థ నీరు వచ్చే సంప్‌లోకి వెళ్లి చిక్కుకుపోయింది. స్థానికుల సమాచారం మేరకు బుధవారం ఉదయం ఈస్ట్రన్‌గాడ్స్ వైల్డ్‌లైఫ్ సభ్యుడు ఓంకార్‌త్యాడి, అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అతికష్టంపై పామును బయటకు తీసి గోనె సంచిలో బంధించి సమీప అడవిలో విడిచిపెట్టారు. ఈ పాము పొడవు సుమారు 12 అడుగులు, బరువు 30 కిలోలకు పైగా ఉంది. దీన్ని చూసేందుకు స్థానికులు ఎగబడ్డారు. ఇంత భారీ సర్పాన్ని తాము గతంలో ఎన్నడూ చూడలేదని వారు చెబుతున్నారు. ఇవి మనుషులకు ఏమీ చేయవని, ఇటువంటివి తారసపడితే తమకు సమాచారం అందించాలని స్నేక్‌క్యాచర్ తెలిపారు.

జనావాసాల్లోకి విషసర్పాలు

ఇటీవల కోసంగిపురం ప్రాంతంలో ప్రభుత్వ లేఅవుట్లు వేసిన సమయంలో పుట్టలు, కొండలను యంత్రాలతో తొలగించారు. ఆ సమయంలో భారీ సంఖ్యలో వివిధ రకాల పాములు కనిపించాయి. అవి చెల్లాచెదురైన తరువాత కొండచిలువ ప్రత్యక్షమైనట్లు స్థానికులు చెబుతున్నారు. టిడ్కో గృహసముదాయం పక్కనే అటవీప్రాంతం ఉండడంతో ఆ వైపు నుంచి కొండచిలువ వచ్చి ఉంటుందని అటవీ సిబ్బంది అంచనా వేస్తున్నారు. ఈ ప్రాంతంలో తరచూ విషసర్పాలు జనావాసాల్లోకి వస్తుండడంతో సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది.

ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేయాలి

- రైతులను ఇబ్బంది పెట్టవద్దు
- జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్


చిక్కాలవలసలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ

నరసన్నపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతు సేవాకేంద్రాల ద్వారా ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేయాలని జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆదేశించారు. బుధవారం కరగాం, చిక్కాలవలసలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొనుగోలు మందకొడిగా సాగడంతోనే కళ్లాలు, రోడ్లమీద ధాన్యం బస్తాలు గుట్టగుట్టలుగా ఉన్నాయన్నారు. కొనుగోలు చేసేందుకు వెంటనే షెడ్యూల్ ఇచ్చి సాంకేతిక సిబ్బంది శాంపిల్స్ సేకరించి ట్రక్కుచీటి జనరేట్ చేయాలన్నారు. రైతులు తమకు నచ్చిన మిల్లుకు పంటను విక్రయించుకోవచ్చని చెప్పారు. 1124 ధాన్యం రకాలను మిల్లర్లు తీసుకోవడం లేదని చిక్కాలవలస రైతులు జేసీకి ఫిర్యాదు చేశారు. కొనుగోలు కేంద్రాలకు వెళ్లే ధాన్యాన్ని వెనక్కి పంపే అధికారం మిల్లర్లకు లేదన్నారు. ఆయన వెంట వ్యవసాయశాఖ జేడీ త్రినాథస్వామి, ఏడీ రవీంద్రభారతి, ఏవో సునీత, తహసీల్దార్ ఆర్.సత్యనారాయణ ఉన్నారు.



ఇది రైస్ మిల్లు కాదు..

ధాన్యం కల్లమే!

ఈ చిత్రం చూసి ఏదో రైస్ మిల్లు ఆవరణలో ధాన్యం నిల్వ చేశారనుకుంటే పొరబడినట్లే. మెళియాపుట్టి మండలం జలగలింగుపురానికి చెందిన కొందరు రైతులు గ్రామ సమీపంలోని కల్లంలో ఇలా ధాన్యం రాసులను ఆరబెట్టుకున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేపట్టకపోవడంతో మరికొందరు రైతులు బస్తాల్లో అక్కడే నిల్వ చేసుకున్నారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో వాటిని భద్రపరచుకుంటున్నారు.

-మెళియాపుట్టి (ఆంధ్రజ్యోతి)

ఒకే మాట.. ఒకే బాట @ నువ్వలరేవు

- ఆచార, సంప్రదాయాలకు ప్రాధాన్యం
- కులదైవం బృందామాత సన్నిధిలోనే నిర్ణయాలు
- 300 ఏళ్ల కిందట ఒడిశా నుంచి వచ్చి స్థిరపడిన కేవిటీలు
- సామూహిక వివాహాలు అక్కడి ప్రత్యేకత

6లో

క్షయతో ముప్పు!

- తొలి దశలోనే మేలుకుంటే మంచిది
- పౌష్టికాహారానికి సాయం పెంపు

6లో

ఒకే మాట.. ఒకే బాట.. @ నువ్వలరేవు

- ఆచార, సంప్రదాయాలకు ప్రాధాన్యం
- కులదైవం బృందామాత సన్నిధిలోనే నిర్ణయాలు
- 300 ఏళ్ల కిందట ఒడిశా నుంచి వచ్చి స్థిరపడిన కేవిటీలు
- సామూహిక వివాహాలు అక్కడి ప్రత్యేకత..


నువ్వలరేవు గ్రామం

ఒకే ఇంట్లో ఉన్న వారే ఒక మాట మీద ఉండడం కష్టం. ఇంట్లోని పెద్దలు చెప్పినట్టు వినడం అరుదు. కానీ దాదాపు 10 వేల మంది కేవలం కొందరి మాట వింటారు. ఒకేమాట మీద ఉంటారు. పెద్దలు చెప్పినట్టు అందరూ నడుచుకుంటారు. ఆచార, సంప్రదాయాలకు అర్థం అన్నట్టుగా నిలుస్తారు. ఇలా అందరూ ఒకే మాట... ఒకే బాటగా నిలిచే ఆ గ్రామం పేరు నువ్వలరేవు. వజ్రపుకొత్తూరు మండలంలోని ఆ ఊరి ప్రత్యేకతలు ఎన్నో..

వజ్రపుకొత్తూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి)

ఆ గ్రామస్థులంతా ఒకే మాటపై ఉంటారు. ఏ విషయంలోనైనా కలిసికట్టుగా నిర్ణయం తీసుకుంటారు. దశాబ్దాలుగా ఆచార, సంప్రదాయాలు తూచా తప్పకుండా పాటించే ఆ గ్రామం పేరు నువ్వలరేవు. ఆ గ్రామాన్ని గతంలో నావలరేవుగా పిలిచేవారు. కాలక్రమంలో నువ్వలరేవుగా మారిందని పెద్దలు చెబుతుంటారు. 300 ఏళ్ల కిందట ఒడిశా ప్రాంతం నుంచి ఇక్కడికి వచ్చి స్థిరపడిన కేవిటీలు చేపలవేటను వృత్తిగా చేసుకుని జీవనం సాగించేవారు. వీరి కులదైవం బృందావతి మాత. ఆరాధ్యదైవం శ్రీరాముడు. గ్రామంలో ఏటా శ్రీరామ నవమి ఉత్సవాలు తొమ్మిది రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తారు. గ్రామంలో ఏ నిర్ణయమైనా బృందావతి మాత సన్నిధిలోనే తీసుకుంటారు. ఒకే మాటకు కట్టుబడి ఉండే కేవిటీ కులస్థులు రాష్ట్రంలో మరెక్కడా లేకపోవడం విశేషం. మొన్నటి వరకు ఓసీ కుల జాబితాలో ఉన్న వీరు మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం (కాంగ్రెస్) హయాంలో బీసీ-ఏ జాబితాలో చేర్చారు. గ్రామంలోని దేవాలయాల్లో నేటికీ నిత్యం భజనలతో పాటు ప్రతి ఒక్కరూ నుదుటన బొట్టు పెట్టుకుని కనిపిస్తుంటారు.



సామూహిక వివాహాలతో గుర్తింపు..

సామూహిక వివాహాలు నువ్వలరేవుకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చాయి. రెండేళ్లకు ఒకసారి సామూహిక వివాహాలు నిర్వహించడం ఇక్కడి ఆచారం. ఈ పెళ్లిళ్లు కూడా ఒకే ముహూర్తానికి నిర్వహించడం మరో ప్రత్యేకత. ఈ పెళ్లిళ్లు జరిగే మూడు రోజులపాటు పండగ వాతావరణం నెలకొంటుంది.

అంతా ఒకే మాటపై..



మా గ్రామంలో అంతా ఒకేమాట మీద ఉంటాం. 10 వేల వరకు జనాభా ఉన్నాం. బృందావతి మాత సన్నిధిలో పెద్దలు తీసుకున్న నిర్ణయానికే కట్టుబడి ఉంటాం. సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలు ఇప్పటి వరకు గ్రామంలో లేవు. పెద్దలు నిర్ణయించిన వారికే పదవులు కట్టబెడతాం. ఏటా ఎంతో ఉత్సాహంతో శ్రీరామ నవమి వేడుకలు నిర్వహిస్తాం.

-వెంకటేష్, మాజీ ఎంపీటీసీ

సుమారు 10వేల జనాభా కలిగిన నువ్వలరేవులో అంతా బంధువులే. దాదాపు 100 జంటల వరకు సామూహిక వివాహాలు జరుగుతుంటాయి. ప్రతి ఇంటా పెళ్లి పందిరి, మామిడి తోరణాలతో గ్రామం కళకళలాడుతుంది. ఈ సామూహిక వివాహాలను చూసేందుకు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు వస్తుంటారు.


సామూహిక వివాహాల సందర్భంగా ఇలా..

నువ్వలరేవుగానే ..



బ్రిటిష్ కాలంలో మా గ్రామాన్ని నావల రేవుగా పిలిచేవారు. కాలక్రమంలో నువ్వల రేవుగా మారిందని మా పూర్వీకులు చెబుతుంటారు. మా గ్రామం పేరు ప్రభుత్వ రికార్డుల్లో లక్ష్మీదేవిపేటగా ఉంది. కానీ నువ్వలరేవుగానే జిల్లా, రాష్ట్రంలో గుర్తింపు ఉంది. సామూహిక వివాహాలు జరుపుకోవడం ద్వారా మా ఐక్యత చాటుకుంటాం. ఎవరికి ఏ కష్టం వచ్చినా అంతా కలసి సాయం అందిస్తాం.

-వెంకటేష్, గ్రామస్థుడు

కొవిడ్-19 తర్వాత సామూహిక వివాహాలు ఏడాదికోసారి నిర్వహిస్తున్నారు.

ఉప్పుటేరే ఆధారం..

ఈ గ్రామానికి పక్కనే పారుతున్న ఉప్పుటేరు గ్రామస్థులకు ప్రత్యేక ఆస్తిగా చెబుతారు. ఉప్పుటేరులో దొరికే చేపలు రుచిగా ఉంటాయని... దీంతో వీటికి మహాగిరాకీ ఉంటుందని నువ్వలరేవు వాసులతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు చెబుతుంటారు. బ్రిటిష్ కాలంలో విశాలమైన ఉప్పుటేరులో నావలు నిలిపేవారు (లంగరు). నావల ద్వారా ఈ ప్రాంతంలో పండించే ఉప్పు ఎగుమతి చేసేవారని గ్రామ పెద్దలు చెబుతుంటారు. దీంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూలీ పనులు చేసేందుకు ఇక్కడికి వచ్చేవారు. దీనికి గుర్తుగా లైట్‌హౌస్, కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఉప్పు బోర్డు కార్యాలయం, సిబ్బంది గృహాలు, వివిధ కార్యాయాలు ఉండేవి. ఇవి శిథిలావస్థలకు చేరడంతో కొద్ది రోజుల కిందట వీటిని తొలగించారు. నావలకు నిలయంగా ఉండడం వల్లనే ఈ గ్రామానికి నావల రేవుగా అప్పట్లో పిలిచేవారు. కాలక్రమంలో నువ్వలరేవుగా మారిందని చెబుతున్నారు. వాస్తవానికి నువ్వలరేవు అసలు పేరు ప్రభుత్వ రికార్డుల్లో లక్ష్మీదేవిపేటగా కొనసాగుతుండడం గమనార్హం.


వధువుకు ఆశీర్వాదం

పిట్ట కొంచెం.. నాట్యం ఘనం!

- 13 ఏళ్లు... 120 ప్రదర్శనలు
- నృత్యంలో రాణిస్తున్న రాజ్యలక్ష్మి




తామరాపల్లి రాజ్యలక్ష్మి

వివిధ ప్రాంతాల్లో నాట్య ప్రదర్శనలతో బహుమతులు సొంతం చేసుకుందీ చిన్నారి. మున్ముందు తన నాట్యంతో మరిన్ని రివార్డులు, అవార్డులను రాజ్యలక్ష్మి సొంతం చేసుకోవాలని కోరుకుందాం.

మెళియాపుట్టి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి)

పిల్లల చేతిలో పుస్తకాలు తప్ప మరొకటి ఊహించకపోవడం... చదువు తప్ప మరో ధ్యాస లేకుండా పెంచడం... ఇదీ నేడు అత్యధిక శాతం తల్లిదండ్రుల తీరు. దీనికి భిన్నంగా చిన్ననాటి నుంచే తమ కుమార్తె అభిరుచులకు అనుగుణంగా నాట్యంలో రాణించేలా ప్రోత్సహిస్తున్నారు మెళియాపుట్టి మండలం చినహంస గ్రామానికి చెందిన తామరాపల్లి జీవనరావు, జ్యోతి దంపతులు. వీరి కుమార్తె రాజ్యలక్ష్మి (13) తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా నాట్యంలో ప్రతిభ కనబరుస్తోంది. ప్రస్తుతం పలాసలో గల ప్రైవేటు పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న రాజ్యలక్ష్మి.. ఇప్పటి వరకూ 120కిపైగా ప్రదర్శనల్లో పాల్గొని ప్రశంసలు అందుకుంది. ఓవైపు చదువులో రాణిస్తూనే ఖాళీ సమయాల్లో నాట్య సాధన చేస్తోంది. మన రాష్ట్రంతో పాటు ఒడిశా, తెలంగాణలోని

చిన్నప్పటి నుంచీ ఆసక్తి..

నా కుమార్తెకు చిన్నప్పటి నుంచి నాట్యంపై ఆసక్తి ఉందని గమనించాను. చదువుతో పాటు నాట్యంలో శిక్షణ ఇప్పించాం. తక్కువ కాలంలోనే మెలకువలు నేర్చుకొని... రాణించడం సంతోషం కలిగిస్తోంది.

-టి.జీవనరావు, తండ్రి

అమ్మానాన్నల సహకారంతోనే..

మా అమ్మానాన్నల సహకారంతో నాట్యంలో రాణిస్తున్నాను. నా ఇష్టాన్ని గుర్తించి...శిక్షణ ఇప్పించడం వల్లనే ఇన్ని ప్రదర్శనలు ఇవ్వగలుగుతున్నా.

-రాజ్యలక్ష్మి

క్షయతో ముప్పు

- తొలి దశలోనే మేలుకుంటే మంచిది
- పౌష్టికాహారానికి సాయం పెంపు


టెక్కలి జిల్లా ఆస్పత్రిలో క్షయ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ఎల్‌టీ శ్రీనివాసరావు, ప్రసాదరావు

మెళియాపుట్టి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టి మండలం వెంకటాపురం పంచాయతీలో ఒక వ్యక్తికి క్షయ (టీబీ) సోకింది. ఆరు నెలలు తిరక్కుండానే వ్యాధితో మృతి చెందాడు. మందులు వేసుకున్నా.. పౌష్టికాహారం తీసుకోకపోవడం వల్ల వ్యాధి నిరోధక శక్తి తగ్గి మృతి చెందినట్టు చెబుతున్నారు. దీనికి కారణం బలమైన ఆహారం తీసుకునే ఆర్థిక స్థోమత లేకపోవడమేనని తెలిసింది. వివిధ ప్రాంతాల్లో అప్పుడప్పుడు ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. బలమైన ఆహారం క్షయ వ్యాధిగ్రస్తులకు అత్యంత అవసరం. లేకపోతే ఇది ప్రాణాల మీదకు తెస్తుందనడంలో సందేహం లేదు. వాస్తవానికి ఇలాంటి వారికి పౌష్టికాహారం కోసం కేంద్ర ప్రభుత్వం నెలకు రూ.500 చొప్పున ఆరు నెలల పాటు ఇస్తోంది. నిరుపేదలకు ఆ మొత్తం ఎటూ సరిపోవడం లేదని గుర్తించింది. దీంతో సాయం మొత్తాన్ని తాజాగా రూ.వెయ్యికి పెంచింది. ఇలా ఆరు నెలలకు రూ.6 వేలను బాధితులకు అందిస్తుంది. నిరుపేదలకు ఇది ఎంతో మేలు చేస్తుందని బాధితులు చెబుతున్నారు.

చాప కింద నీరులా...

క్షయ వ్యాధి జిల్లాలో చాప కింద నీరులా వ్యాపిస్తోంది. ఇది సోకిన వ్యక్తితో పాటు ఆ కుటుంబ సభ్యులకు సైతం ముప్పు పొంచి ఉంటుంది. వ్యాధి లక్షణాలను ప్రారంభంలో గుర్తించి ప్రభుత్వాస్పత్రిలో పేరు నమోదు చేసుకొని వైద్యుల సూచనలు పాటిస్తే దీని నుంచి బయట పడవచ్చని వైద్యులు చెబుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో క్షయకు సంబంధించి ఉచిత నిర్ధారణ పరీక్షలు, మందుల పంపిణీ చేస్తున్నారు. ఈ వ్యాధి సోకిన వారికి పౌష్టికాహారం నిమిత్తం కేంద్ర ప్రభుత్వం ప్రతి నెల రూ.1000 వంతున చెల్లించనుంది. వ్యాధి సోకిన వారికి ఇది కొంత ఉపశమనాన్ని ఇస్తోంది. ఏటా జనవరి నుంచి అక్టోబరు వరకు వైద్యాధికారులు దీనికి సంబంధించి కార్యాచరణను రూపొందిస్తారు. క్షయను రెండు రకాలుగా పరిగణించి... 9 నెలల నుంచి 11 నెలల వరకు మందులు పంపిణీ చేస్తారు. అయిదేళ్ల లోపు పిల్లలకు వ్యాధి సోకకుండా ముందే మాత్రలు ఇస్తారు. దీనితో పాటు వ్యాధి నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. బాధితులను గుర్తించేందుకు కేంద్ర ఆరోగ్య శాఖ ఇంటింటి సర్వే చేయించింది. ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి విస్తృతంగా పరీక్షలు చేసింది.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో క్షయ వ్యాధిని నిర్ధారించేందుకు 12 కేంద్రాల ద్వారా ట్రూనాట్, సీబీ నాట్, మైక్రోస్కోపిక్ పరీక్షలు చేస్తున్నారు. జిల్లాలో 2023లో 3,560 కేసులు రాగా 94 శాతం నయమైనట్టు వైద్యులు చెబుతున్నారు. 2024లో జనవరి నుంచి అక్టోబరు వరకు 59,019 మందికి పరీక్షలు చేయగా... 2,890 మందికి క్షయ వ్యాధి ఉన్నట్లు గుర్తించారు. ఇందులో 98 మందికి క్షయతో పాటు హెచ్‌ఐవీ ఉన్నట్టు నిర్ధారణ అయిందని వైద్యాధికారులు చెబుతున్నారు. క్షయ వ్యాధి సోకిన వారు జాగ్రత్తగా మందులు వాడుకుంటే దీని నుంచి బయట పడవచ్చని అంటున్నారు.

దాతల సహకారం అవసరం..

క్షయతో బాధ పడుతున్న వారికి పౌష్టికాహారం అందించగలిగితే వ్యాధి వేగంగా తగ్గుతుందని వైద్యులు చెబుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో కొన్ని స్వచ్ఛంద సంస్థల ద్వారా గుడ్లు, పాలు, గోధుమ పిండితో పాటు అవసరమైన వస్తువులు అందించేవారు. వైసీపీ ప్రభుత్వం పూర్తిగా క్షయ బాధితులను పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి. అందువల్ల బాధితులు దీర్ఘకాలంగా దీంతో పోరాడవలసి వచ్చిందని అంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో మాట్లాడి సహకారం అందించే ఏర్పాట్లు చేస్తే మంచిదని బాధితులు కోరుతున్నారు.


టీబీ నిర్ధారణ కేంద్రం

బాధితుల జాబితాను పంపించాం..



ఈ ఏడాదిలో క్షయ వ్యాధి బాధితుల వివరాలను ప్రభుత్వానికి పంపించాం. గతంలో బాధితులకు నెలకు రూ.500 వంతున ఇచ్చేవారు. ఈ నెల నుంచే రూ.వెయ్యికి పెంచారు. దీని వల్ల బాధితులు మంచి పౌష్టికాహారం తీసుకునే అవకాశం ఉంటుంది. వ్యాధి లక్షణాలను గుర్తించిన వెంటనే దాచుకోకుండా మందులు వాడితే మొదటి దశలోనే నయమవుతుంది. ఇంటిలో పిల్లలు ఉంటే ముందస్తుగా మందులు వాడితే మంచిది. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి, బరువు తగ్గడం, రక్తం పడడం వంటి లక్షణాలు ఉంటే వైద్య పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం.

-పి.శ్రీనివాస్, జిల్లా టీబీ ప్రోగ్రాం కోఆర్డినేటర్

నాగావళి చెంత ఇలా... స్వచ్ఛత ఎలా?

- మళ్లీ పేరుకుపోయిన చెత్తాచెదారాలు
- నగరవాసుల్లో లోపిస్తున్న సామాజిక స్పృహ
- వ్యర్థాలను నదిలో వేస్తున్న వ్యాపారులు


ఇటీవల నాగావళి నదిలో కలెక్టర్ తదితరులు స్వచ్ఛతా కార్యక్రమం నిర్వహించిన దృశ్యం

శ్రీకాకుళం అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): 'స్వచ్ఛ శ్రీకాకుళం' ధ్యేయంగా ప్లాస్టిక్ నివారణతో పాటు పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అనే సంకల్పంతో ఇటీవల జిల్లా ఉన్నతాధికారులు కదిలారు. ఏడు రోడ్ల జంక్షన్ సమీపంలోని ఉమారుద్ర కోటేశ్వర ఆలయం వద్ద గల నదీ పరీవాహక ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దడానికి నడుం బిగించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపు మేరకు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో పాటు మున్సిపల్ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థలు, యువత పెద్ద ఎత్తున కదిలి వచ్చారు. వ్యర్థాలను తొలగించారు. ఇది జరిగి నెల రోజులు గడవకముందే నాగావళి పరీవాహక ప్రాంతం మళ్లీ ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తా చెదారాలతో నిండిపోయింది. ప్రజలు, మున్సిపల్ అధికారుల్లో మార్పు రాకపోవడంతో ఇలాంటి పరిస్థితులు తలెత్తుతున్నాయని పర్యావరణ ప్రేమికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఓవైపు నగర పాలక అధికారులు ప్లాస్టిక్ నిషేధంపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టకపోవడం... మరోవైపు ప్రజలు తమ ఇళ్లలోని వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడేయడం... వర్తక, వ్యాపారులు, కూడా వ్యర్థాలను నాగావళి నదిలో పారవేయడంతో ఈ దుస్థితి తలెత్తుతోందని పర్యావరణ ప్రేమికులు ఆరోపిస్తున్నారు.


ప్రస్తుతం నాగావళి నది దుస్థితి..

ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలే లక్ష్యం

- త్వరలో జిల్లాకు మరో 42 కొత్త బస్సులు
- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బుధవారం శ్రీకాకుళం-1, 2 డిపోలకు కూటమి ప్రభుత్వం నూతనంగా 25 బస్సులను బుధవారం అందించింది. ఈ బస్సులను ఎమ్మెల్యే శంకర్ బుధవారం ఆర్టీసీ డిపోలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొలుత జిల్లాకు 25 బస్సులు వచ్చాయని, త్వరలో మరో 42 కొత్త బస్సులు రానున్నాయని తెలిపారు. ఇందులో ఇంద్ర ఏసీ బస్సుతోపాటు ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సులు ఉన్నాయన్నారు. త్వరలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం ప్రభుత్వం కల్పించనుందని తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాకుళం-1, 2 డిపో మేనేజర్లు, సిబ్బంది, యూని యన్ నాయకులు, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి కొత్త బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

- నగరంలో అన్ని జంక్షన్ల వద్ద గల కాలువల్లో మురుగునీరు సక్రమంగా వెళ్లేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. నగరంలోని డే అండ్ నైట్ జంక్షన్ వద్ద ప్రధాన కాలువ నుంచి మురుగునీరు ఆటంకం లేకుండా వెళ్లేందుకు చేపడుతున్న పనులను ఆయన బుధవారం పరిశీలించారు.
- జిల్లాలోని దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. రథసప్తమిని రాష్ట్ర పండుగగా నిర్వహించడానికి త్వరలోనే ఉత్తర్వులు రానున్నాయని తెలిపారు. జిల్లాలో 88 దేవాలయాలు ఉన్నాయని, వాటికి సంబంధించిన భూముల వివరాలు సమగ్రంగా తెలియజేయాలని సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో దేవదాయశాఖ డీసీ వై.భద్రాజీ, ఏసీ ప్రసాద్ పట్నాయక్, శ్రీకూర్మం దేవస్థానం ఈవో గురునాథం పాల్గొన్నారు.
- బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలో బాల్యవివాహాల నిర్మూలనపై బుధవారం నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో డీఎస్పీ వివేకానంద, బ్రెడ్స్ సంస్థ మేనేజర్ మజ్జి సింహాచలం, అధికారులు, పోలీసు సిబ్బంది, సహాయక సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

కపాసుకుద్దిలో విచారణ

కవిటి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సీహెచ్ కపాసుకుద్ది గ్రామంలో పారిశుధ్యం, రోడ్ల నిర్మాణంలో అవకతవకలు జరిగాయని ఆ గ్రామానికి చెందిన బి.గురుమూర్తి, సురేష్ కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం డీఎల్‌పీవో ఆర్.గోపిబాల గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారులు, కార్యదర్శులు నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా జరిగిన పనులనుఏ పరిశీలించారు. నివేదికను కలెక్టర్‌కు నివేదికను అందిస్తామని డీఎల్‌పీవో తెలిపారు. ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఈవోపీఆర్డీ శివాజీ పాణిగ్రాహి, కార్యదర్శి మన్మధరావు ఉన్నారు.

వీధి కుక్కలకు వ్యాక్సినేషన్

అరసవల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలోని వీధి కుక్కలకు బుధవారం యాంటీ రాబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఆరోగ్యాధికారి సుధీర్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు, మేస్త్రీలు, పశు సంవర్థకశాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇచ్ఛాపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యుత్ పనుల మరమ్మతుల నిమిత్తం పట్టణ పరిధిలోని పలు వీధుల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు విద్యుత్‌శాఖ డీఈ విఘ్నేశ్వరరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కార్జీ వీధి, హాస్పటల్ రోడ్, ఉప్పలవీధి, మంగళవారంపేట, రథంవీధి, పంజావీధి, గొల్లవీధి, కోర్టు స్ట్రీట్, పకీర్‌పేట, వీకే పేట, రత్తకన్న, చక్రపాణీవీధితో పాటు మండపల్లి ఏరియాలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

17 అగ్నిమాపక కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు

శ్రీకాకుళం క్రైమ్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం లో 17 అగ్నిమాపక కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయని రాష్ట్ర విపత్తుల స్పందన, అగ్నిమాపక విభాగపు అడిషనల్ డైరెక్టర్ జి.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం స్థానిక అగ్నిమాపక కార్యాలయాన్ని సందర్శించిన ఆయన విలేఖరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విపత్తుల విభాగానికి రూ.250 కోట్లు కేటాయించినట్టు చెప్పారు. 100 ఫైరింజన్లు, 17 కొత్త ఫైర్ స్టేషన్లు ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. వీటిలో కొన్ని కొత్త జిల్లాలకు కేటాయిస్తామన్నారు. ప్రమాదాలు సంభవించేటప్పుడు కాలర్ ఫోన్ వస్తే జీపీఎస్ ద్వారా ప్రమాద లోకేషన్ జిల్లా కేంద్రంలోని కమాండ్ కంట్రోల్‌కు వస్తుంద న్నారు. రసాయన కర్మాగారాల్లో డ్రోన్స్, రోబో వెహికల్స్ అందుబాటులోకి వస్తాయన్నారు. అంతకుముందు జిల్లా అగ్నిమాపక అధికారి జడ్డు మోహనరావు, సహాయాధికారి వరప్రసాదరావులతో తొలుత జిల్లాలో పరిస్థితులపై సమీక్షించారు. పారిశ్రామిక వాడ, ప్రమాదం ఎక్కువగా ఉండే ప్రాంతాలు గుర్తించి అందుబాటులో ఉన్న పరికరాలు, యంత్రాలపై అడిగి తెలుసుకున్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న విపత్తుల స్పందన, అగ్నిమాపక విభాగపు అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసులు

కొంగరాంలో విషజ్వరాలు

ఎచ్చెర్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పొన్నాడ పీహెచ్‌సీ పరిధి కొంగరాం గ్రామంలో సుమారు నలభై నుంచి యాభై మంది వరకు విషజ్వరాలతో బాధపడుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు. కొద్ది రోజులుగా జ్వరాలతో బాధపడిన వారి సంఖ్య ఎక్కువతోంది. కొంతమంది స్థానికంగా, మరికొంత శ్రీకాకుళం నగరంలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. జ్వరాల బారిన పడిన వారి సంఖ్య రోజు రోజుకీ పెరుగుతుండడంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జ్వరాల నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శేషగిరిరావుతో మాట్లాడగా.. ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు.



ఇంట్లోనే చికిత్స పొందుతున్న గ్రామస్థుడు

'నిర్బంధ రిటైర్మెంట్‌ను నిలుపుదల చేయించండి'

రణస్థలం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఒరిసాం గ్రామంలోని శ్యాంపిస్టన్స్ అండ్ రింగ్స్ ప్లాంట్-2లో 30 ఏళ్ల సర్వీసు పూర్తిచేసిన సిబ్బందిని యాజమాన్యం చేయిస్తున్న నిర్బంధ రిటైర్మెంట్ నిలుపుదల చేయించాలని మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కలిసి వర్కర్ల యూనియన్ నాయకులు కోరారు. రామచంద్రాపురంలో ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం యూనియన్ నాయకులు గొర్లె కిరణ్, ఆర్‌పీ నాయుడు మంత్రిని కలిసి వినతిపత్రాన్ని అందించి తమ సమస్యను వివరించారు. విశాఖలో జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ లేకపోవడంతో కార్మికుల సమస్యలపై సంయుక్త సమావేశాలు లేక పరిష్కారం కావడంలేదన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ఆమదాలవలస, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 29న నిర్వహించనున్న జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ కోరారు. ఈ మేరకు ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహిస్తున్న ఈ జాబ్‌మేళాలో సుమారు 15 బహుళజాతి ప్రైవేట్ సంస్థలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గంలో ఉన్న పదో తరగతి నుంచి పీజీ వరకు చదువుకున్న నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రవి కుమార్ కోరారు. కార్యక్రమంలో ఏపీ ఎస్ఎస్‌డీసీ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్, సిబ్బంది ఉన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి: డీఈవో

జి.సిగడాం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పది ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా బోధన చేపట్టాలని డీఈవో తిరుమల చైతన్య సూచించారు. బుధవారం బాతువ, ఎందువ, డి.బొండపల్లి ఉన్నత పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించి వారిపై దృష్టి సారించాలన్నారు. అనంతరం ఎండీఎం, పాఠశాలకు సంబంధించిన పలు రికార్డులను ఆయన పరిశీలించారు. ఈయన వెంట ఏంఈవోలు అరసాడ రవి, ముల్లు శ్రీనివాసరావు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, తదితరులు ఉన్నారు.



విద్యార్థులతో కలిసి భజనం చేస్తున్న డీఈవో

ఎస్‌ఐ పట్ల దురుసు ఘటనపై సీఐ విచారణ

శ్రీకాకుళం క్రైమ్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎస్‌ఐ విధులకు ఓ వ్యక్తి ఆటంకం కలిగించడంతో పాటు దురుసుగా ప్రవర్తించిన ఘటనపై శ్రీకాకుళం సీఐ కె.పైడపునాయుడు బుధవారం విచారణ చేపట్టారు. ఈ మేరకు సీఐ మాట్లాడుతూ.. ఈ నెల 24వ తేదీ రాత్రి గోల్కొండ రేవువీధిలో సరస్వతుల పవన్ మణికంఠ అనే వ్యక్తి దమ్మలవీధికి చెందిన సూరాడ సత్యం అనే వ్యక్తితో వాగ్వాదానికి దిగి దాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న వన్ టౌన్-2 ఎస్‌ఐ రామారావు ఘటనా స్థలానికి చేరుకుని, వారిని నిలువరించేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఎస్‌ఐ రామారావుపై పవన్ మణికంఠ దురుసుగా ప్రవర్తించి, విధులకు ఆటంకం కలిగించాడు. దీనిపై ఎస్‌ఐ రామారావు మంగళవారం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. ఎస్‌ఐ ఎం.హరికృష్ణ కేసు నమోదు చేశారు. దీనిపై స్థానికులను విచారించానని, నివేదికను ఉన్నతాధికారులకు ఇవ్వనున్నట్టు సీఐ తెలిపారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను నిర్మూలించడమే ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్కరు పనిచేయాలని కేంద్ర మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి అన్నపూర్ణాదేవి పిలుపునిచ్చారు. బుధవారం ఢిల్లీ నుంచి ఆమె వర్చువల్ విధానంలో నిర్వహించిన 'బాల్ వివాహ్ ముక్త్ భారత్' కార్యక్రమంలో జిల్లా నుంచి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హాజరయ్యారు. కార్యక్రమంలో బాల్య వివాహాల నిర్మూలనకు అసాధారణ కృషి చేసిన కొందరు వ్యక్తులతోపాటు బాల్య వివాహాలను ఎదుర్కొని విజయం సాధించిన తొమ్మిది మంది పిల్లలతో కేంద్రమంత్రి మాట్లాడి వారి అనుభవాలు తెలుసుకున్నారు. ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, పీవో ఎం.మల్లేశ్వరరావు, పీవో ఐఎల్ నాయుడు, వివిధ కళాశాలల విద్యార్థినులు, వన్‌స్టాప్ సెంటర్ కోఆర్డినేటర్ హిమబిందు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న కలెక్టర్ పుండ్కర్ తదితరులు

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

ఆమదాలవలస, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ అన్నారు. బుధవారం పట్టణంలోని కృష్ణాపురం సచివాలయం నెంబర్-2, మోనింగి వారివీధి-1, 2 సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కృష్ణాపురం సచివాలయంలో హాజరు పట్టీ సక్రమంగా నిర్వహించకపోవడంపై మెమోలు జారీ చేశారు.

అప్రమత్తంగా ఉండాలి

సోంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని పలాస ఆర్డీవో జి.వెంకటేష్ సూచించారు. బారువ ప్రాంతంలో ఆయన పర్యటించారు. షాపింగ్ కాంప్లెక్స్, పెట్రోల్ బంకుల కోసం తహసీల్దార్ కార్యాలయం, దుర్గాగుడి దగ్గర స్థలాను పరిశీలించారు.

జీవో 329 రద్దు చేయాలి

సోంపేట: ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌ను ఆయన స్వగృహంలో పర్యావరణ పరిరక్షణ సమితి ప్రతి నిధులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. 329జీవో రద్దుచేయాలని, ఉద్యమకారులపై ఉన్న కేసును ఎత్తివేయాలని కోరారు.

రేపు టెలికాం వినియోగదారుల సదస్సు

అరసవల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల హక్కులు, బీఎస్ఎన్ఎల్ సేవలపై ఈ నెల 29న మధ్యాహ్నం 3.00 గంటలకు జిల్లా కేంద్రంలోని సంచార భవన్‌లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు బిజినెస్ ఏరియా జనరల్ మేనేజర్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు తమ సమస్యలు, సలహాలను తెలియజేయాలని కోరారు.

స్కిల్‌హబ్ సెంటర్‌లో ఉచిత ఉపాధి శిక్షణ

ఎచ్చెర్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎచ్చెర్ల ఐటీఐలో నిర్వహిస్తున్న స్కిల్ హబ్ సెంటర్‌లో పలు ఉపాధి కోర్సుల్లో మూడు నెలల ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు తెలిపారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో చేరేందుకు ఇంటర్మీడియట్ చదివిన యువతీ యువకులు అర్హులన్నారు. ప్లంబర్ కోర్సులో చేరేందుకు పదో తరగతి చదివి, పురుష అభ్యర్థులు మాత్రమే చేరేందుకు అర్హులన్నారు. 18 నుంచి 30 ఏళ్ల లోపు వయసు ఉండాలన్నారు. ఆసక్తి గలవారు డిసెంబరు 2వ తేదీలోగా ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐను సంప్రదించాలన్నారు. వివరాలకు 7989177887 ఫోన్ నెంబరులో సంప్ర దించాలన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

గార నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఆర్.జనార్దన్ అన్నారు. బుధవారం రాత్రి బూరవెల్లిలో నిర్వహించిన సంకల్పం కార్యక్రమంలో ఆయన పలు సూచనలు చేశారు. ముఖ్యంగా డిజిటల్ అరెస్టుపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఉన్నత విద్యామండలి సమీక్ష

ఎచ్చెర్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్వయమ్ (స్టడీ వెబ్స్ ఆఫ్ యాక్టివ్ లెర్నింగ్ ఫర్ యంగ్ ఎస్పైరింగ్ మైండ్స్) ప్లస్ కోర్సుల్లో విద్యార్థులు, అధ్యాపకుల నమోదుకు ఉన్నత విద్యామండలి వర్చువల్ విధానంలో బుధవారం సమీక్షించినట్టు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ కేఆర్ రజని తెలిపారు. ఈ కార్యక్రమానికి నోడల్ ఏజెన్సీగా వ్యవహరించిన మద్రాసు ఐఐటీ ప్రొఫెసర్ దక్షిణామూర్తి ఈ సమీక్షలో పలు వివరాలు వెల్లడించారన్నారు. పలు విశ్వవిద్యాలయాల వీసీలు, ఉన్నతాధికారులతో రాష్ట్ర ఉన్నత విద్యామండలి బుధ వారం సమీక్ష నిర్వహించింది.

క్రైం కార్నర్

పోలీసునంటూ దోపిడీ

కోటబొమ్మాళి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కన్నేవలస గ్రామ సమీపంలో వంశధార వంతెన వద్ద బుధవారం సాయంత్రం పోలీస్‌ను అని చెప్పి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఇద్దరి వద్ద దారి దోపిడీకి పాల్పడి పరారయ్యాడు. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ట్రాక్టర్ పంక్చర్ అవడంతో వేరే చోట పంక్చర్ వేసేందుకు రాంగ్‌రూట్‌లో వెళుతున్న ట్రాక్టర్‌ను సదరు వ్యక్తి ఆపి ఫైన్ కట్టాలని డ్రైవర్ ధర్మాన అచ్చుతరావును డిమాండ్‌చేశారు. అయితే తనవద్ద ఏమీ లేవని, జేబులో ఉన్న రూ.100 ఇచ్చి వెళ్లిపోయాడు. అక్కడి నుంచి కన్నేవలస రోడ్డుకు వెళ్లిన సదరు వ్యక్తి సైకిల్‌పై కన్నేవలస వెళుతున్న గ్రామానికి చెందిన రైతు పాగోటి కోందండరావును ఆపి నీ జేబులో ఉన్న పర్సును తీసి ఇవ్వాలని చెప్పగా పోలీస్ కదా అని పరిశీలించి ఇస్తాడనుకుని పర్సు చూపించాడు. దీంతో వరిచేను కూలీలకు ఇచ్చేందుకు తీసుకువెళుతున్న రూ.10 వేలను తీసుకుని పర్సును అతడి చేతిలో పెట్టి అక్కడి నుంచి బైక్‌పై ఉడాయించాడు. దీంతో సదరు రైతు మోసపోయానని లబోదిబోమన్నాడు. ఈ విషయమై కోదండ రావు, ట్రాక్టర్ డ్రైవర్ అచ్చుతరావు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీనిపై సమాచారం అందిందని, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు.

900 లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం

మెళియాపుట్టి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రింపి గ్రామంలో టెక్కలి ఎక్సైజ్ అధికారులు బుధవారం సారా తయారీ కేంద్రాలపై దాడులు చేసి 900 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ మీర్‌సాహెబ్ తెలిపారు. 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో ఎస్ఐలు సత్య నారాయణ, గురుమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులో జారిపడి అర్చకుడి మృతి


రామాచార్యులు (ఫైల్)

నందిగాం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పెంటూరు వెంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడిగా పనిచేస్తున్న దుంబారం రవి రామాచార్యులు(38) చెరువులో పడి మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రవిరామాచార్యులు 20ఏళ్లుగా అర్చకుడిగా పనిచేస్తున్నారు. ఆలయానికి సంబంధించిన పూజా పత్రి ప్రతిరోజు నందిగాం సమీపంలోని ఎదురు బందలో వేస్తుంటారు. రోజువారీలాగానే మంగళవారం కూడా చెరువులో వేసేందుకు వెళ్లాడు. రాత్రయినా రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతకగా చెరువు మెట్ల పై సెల్‌ఫోన్ ఉండడాన్ని గమనించారు. చెరువులో జారిపడి ఉంటాడని భావించి వెతికారు. చెరువులో మునిగి ఉన్న అతడిని బయటకు తీసి చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బుధవారం ఉదయం మృతుడి సోదరి పి.రంగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షేక్ మహ్మద్ ఆలీ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి తల్లి ఉంది.

వ్యక్తి అదృశ్యం


అదృశ్యమైన రామకృష్ణ

నందిగాం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పెంటూరుకు చెందిన బెహరా రామకృష్ణ (44) అదృశ్యమైనట్లు వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షేక్‌మహ్మద్ ఆలీ తెలిపారు. రామకృష్ణ ఈనెల 23న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆయన ఆచూకీ కోసం బంధువుల ఇళ్లల్లో చూసి కనిపించకపోవడంతో బుధవారం భార్య సంధ్య ఫిర్యాదు చేసింది. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోస్టాఫీస్‌లో చోరీయత్నం


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

ఇచ్ఛాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధి రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న పోస్టాఫీస్‌లో దుండగులు చోరీ యత్నానికి పాల్పడ్డారు. మంగళ వారం రాత్రి కార్యాలయం ముందు గది తాళాలు పగలు గొట్టి లోపలికి ప్రవేశించారు. బుధ వారం పోస్ట్‌మాస్టర్ జ్ఞాన వతి, సిబ్బంది కార్యాలయానికి వచ్చి చూసే సరికి తాళాలు కింద పడి ఉన్నాయి. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరకున్న పట్టణ ఎస్ఐ చిన్నమనాయుడు, సిబ్బంది పరిశీలించారు. మధ్యాహ్నం క్లూస్ టీం సీఐ భరత్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆధారాలు సేకరిం చారు. అయితే కార్యాలయంలో ఎటువంటి వస్తువులు, గాని స్టాంపులు గాని పోలేదని గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.



24 గేదెలు పట్టివేత

కంచిలి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎటువంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న 24 గేదెలను ఎస్ఐ పి.పారినాయుడు బుధవారం రాత్రి పట్టుకున్నారు. జాతీయ రహదారిపై తనిఖీలు నిర్వహిస్తుండగా నాలుగు వాహనాల్లో వీటిని పట్టుకుని కొత్తవలస గోశాలకు తరలించినట్టు తెలిపారు. ఒడిస్సా రాష్ట్రం కొనిసి ప్రాంతం నుంచి వీటిని తరలిస్తున్నట్టు విచారణలో తేలిందన్నారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

లైసెన్స్ లేకుండా విక్రయిస్తున్న మందుల స్వాధీనం

జలుమూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగంలో లైసెన్స్ లేకుండా మందులు విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు జిల్లా ఔషధ నియంత్రణ శాఖ సహాయ సంచాలకులు ఎం.చంద్రరావు తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఆర్ఎంపీ రామ్మోహనరావు మందులు విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు బుధవారం అతని ఇంటిలో తనిఖీ చేపట్టామన్నారు. ఈ సందర్భంగా రూ.50వేలు విలువ చేసే మందులను స్వాధీనం చేసుకొని ఔషధ చట్టం 1940 నిబంధనల మేరకు కేసు నమోవు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో టెక్కలి ఔషధ తనిఖీ అధికారి ఎస్.యుగంధరరావు తదితరులు పాల్గొన్నారు.

డైరెక్టర్లుగా పుచ్చ, కుత్తుమ ప్రమాణ స్వీకారం



ప్రమాణం చేస్తున్న ఈశ్వరరావు, లక్ష్మణరావును సత్కరిస్తున్న నేతలు

వజ్రపుకొత్తూరు/పలాస రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్లుగా నియమితులైన పుచ్చ ఈశ్వరరావు, కుత్తుమ లక్ష్మణరావు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. అమరావతిలోని కార్యాల యంలో ఈ వేడుక నిర్వహించారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ చైర్మన్ బర్రి ప్రసాదరావు, నర్సాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, రాజ్యసభ మాజీ సభ్యుడు మోపిదేవి వెంకట రమణ, టీడీపీ వజ్రపుకొత్తూరు మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, మాజీ సర్పంచ్‌లు దున్న షణ్ముఖరావు, చింత నారాయణ, గోవిందు పాపారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ.. తనను రాష్ట్రస్థాయి పదవికి ఎంపిక చేసిన సీఎం చంద్రబాబునాయకుడు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తదితరులకు రుణపడి ఉంటానన్నారు. అలాగే కుత్తుమ లక్ష్మణకుమార్ మాట్లాడుతూ.. తనకు అప్పగించిన పనిని బాధ్యతాయుతంగా నిర్వహిస్తామని తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

జలుమూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. కత్తిరివానిపేట పార్టీ క్యాంపు కార్యాలయంలో క్యాన్సర్ బాధితురాలు ముద్దు సూరమ్మకు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.2.20 లక్షలు చెక్కును బుధవారం అందించారు. సర్పంచ్ పంచిరెడ్డి రామచంద్రరావు, దామోదరరావు, గంగాధర్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యేలు మామిడి గోవిందరావు, బగ్గు రమణమూర్తి కోరారు. పాతపట్నం, నరసన్నపేట నియోజక వర్గాల్లో బుధవారం కేంద్రాలను ప్రారంభించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎంజీఆర్

పాతపట్నం/మెళియాపుట్టి/హిరమండలం/ ఎల్ఎన్ పేట/ కొత్తూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. కొరసవాడ, మర్రిపాడు-సి, హిరమండలం, రావిచెంద్రి, మెట్టూరు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. ఎటు వంటి తప్పిదాలు లేకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. దళారులను ఆశ్రయిం చకుండా రైతు సేవా కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మంచి మద్దతు ధర పొందాలని రైతులను కోరారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లగా వాటిని పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, జేడీఏ త్రినాథస్వామి, ఏడీఏలు మధుబాబు, రాజగోపాలరావు, జడ్పీటీసీ బుచ్చిబాబు, చేనేత నాయకుడు మంచు కృష్ణారావు, టీడీపీ మండలాల నాయకులు పైల బాబ్జీ, మద్దు రామారావు, ఎస్. మోహనరావు, సర్పంచ్ రవ్వల అనూరాధ, గణపతిరావు, ఎస్.తేజేశ్వర రావు, వి.ఆనందరావు, ఎం.మనోహర్ నాయుడు, కె.చిరంజీవి, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఏఓలు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పనకు చర్యలు: బగ్గు

పోలాకి నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతులు తాము పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించేందుకే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తోందని, వీటిని వినియోగించు కోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బుధవారం పీఏసీఎస్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు రూ.1,684 కోట్లు బకాయి పడిందని, దానిని అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. 17శాతం లోపు తేమ ఉండేలా రైతు ధాన్యాన్ని నూర్పు చేసిన వెంటనే కల్లాల్లో ఆరబెట్టాలన్నారు. జేడీఏ కె.త్రినాథ స్వామి మాట్లాడుతూ.. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. కార్యక్రమం లో పోలాకి సహకార సొసైటీ ఇన్‌చార్జి పద్మ, సీఈవో బి.రాంబాబు, ఏడీఏ రవీంద్రభారతి, టీడీపీ నాయకులు ఎంవీ నాయుడు, తమ్మినాన భూషణరావు, సూరపు నారాయణదాస్, భైరిబాస్కరరావు, రోణంకి కృష్ణం నాయుడు, తహసీల్దారు సురేష్ కుమార్, ఎంపీడీవో గరిమెళ్ల రవి కుమార్, ఏవో చిరంజీవి, కరుకోల రామారావు, మజ్జి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు మామిడి గోవిందరావు, బగ్గు రమణమూర్తి

బాల్య వివాహాలు చట్టరీత్యానేరం

కొత్తూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయడం నేరమని జూనియర్ సివిల్ న్యాయాధికారి కె.రాణి అన్నారు. సిరుసువాడ గ్రామంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నతనంలో ఆడపిల్లలకు వివాహాలు చేయడం వల్ల వారి ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. సీఐ ప్రసాద్ మాట్లాడుతూ.. భ్రూణ హత్యలు నేరమన్నారు. ఆడబిడ్డలపై మమకారం పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కొత్తూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.అప్పారావు, సెక్రటరీ సుధాకర్, అసిస్టెంట్ ప్రభుత్వ న్యాయవాది రాడ రాజు, న్యాయవాదులు పాల్గొన్నారు.

న్యాయవాదులతో ప్రతిజ్ఞ

కోటబొమ్మాళి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి బీఎంఆర్ ప్రసన్నలత అన్నారు. బుధవారం స్థానిక కోర్టులో న్యాయవాదులు, కోర్టు సిబ్బందితో పాటు సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, జలుమూరు పోలీస్ అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు.

ప్రోత్సహిస్తే కేసులు..

పలాస, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వీటిని ప్రోత్సహించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసే అవకాశం ఉందని మున్సిఫ్ న్యాయాధికారి యు.మాధురి అన్నారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాల్య వివాహాలపై అవగాహన కలిగించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.విశ్వే శ్వరరావు, కార్యదర్శి పిండి వెంకటరావు, న్యాయవాదులు పీజే రాజరత్నంనాయుడు, టీకేఆర్ పట్నాయక్, ఎల్.చంద్రశేఖర్, బి.రవికుమార్ పట్నాయక్ పాల్గొన్నారు.

చదువే ముద్దు..

టెక్కలి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు వద్దు.. చదువే ముద్దు అని జూనియర్ సివిల్ న్యాయాధికారి మల్ల తేజాచక్రవర్తి అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో 'బాల్ వివాహ్ ముక్త్ భారత్'లో భాగంగా న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివ్వల వివేకానంద, ప్రిన్సిపాల్ ఈశ్వరమ్మ, ఎస్ఐ రాము, న్యాయవాది ఆనందరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అరికట్టాల్సిన బాధ్యత అందరిదీ..

జలుమూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎంపీడీవోవో కె.అప్పలనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో బుధవారం కిశోరి వికాసం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్య వివాహాలు సాంఘిక దురాచారమని, దీనిని రూపుమాపాలన్నారు. ఐసీడీఎస్ పీవో కంచికామాక్షి, ఎంఈవోలు బి.మాధవరావు, ప్రసాదరావు, రిసోర్సు పర్సన్ దవళ సరస్వతి పాల్గొన్నారు.

కిశోర బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

పలాసరూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కాశీబుగ్గ ఐసీడీఎస్ పీవో పార్వతి అన్నారు. పలాస మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఐసీడీ ఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసంపై అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో వసంత్‌కుమార్, ఎంఈవో శ్రీనివాసరావు, వైద్యులు సునీల్‌కుమార్ తది తరులు పాల్గొన్నారు.

బాల్య వివాహ రహితంగా..

ఇచ్ఛాపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహరహిత ఇచ్ఛాపురంగా తీర్చిదిద్దుదామని తహసీల్దార్ వెంకటరావు అన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా అంగన్‌వాడీ కార్యకర్తలతో అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులచే ప్రతిజ్ఞ చేయించారు.

- కవిటి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు నిరోధించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ మురళీకృష్ణ కోరారు. కవిటిలో బుధవారం కిశోర వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు.
- ఆమదాలవలస, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎంపీడీవో రోణంకి వెంకటరావు అన్నారు. బుధవారం పట్టణంలో బాల్య విహాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ రాంబాబు, ఎంఈవో పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

ఎల్.ఎన్.పేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు మృతి చెందితే వారి కుటుంబాలను ఆదుకోవాలని ఆ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు రావిచంద్రి గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కేవీ హేమలత, కె.లక్ష్మి మాట్లాడుతూ.. ఇటీవల ఎల్.ఎన్.పేట, హిరమండలం మండలాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు నలుగురు అనారోగ్యంతో మృతి చెందారని, వారి కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బం దులు పడుతున్నారన్నారు. తగు చర్యలు తీసుకుని వారికి న్యాయం చేయాలని కోరారు. మృతుల కుటుం బాల్లో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూని యన్ నాయకులు సుధీష్ణ, సుభాషిని, నిర్మల, లక్ష్మి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి శివాజీ పరామర్శ



హరిపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మందసలో ఇటీవల మృతిచెందిన సర్దార్ గౌతు లచ్చన్న అనుచరుడు, టీడీపీ సీనియర్ నాయకుడు కొర్నాన భాస్కరరావు కుటుంబానికి మాజీ మంత్రి గౌతు శివాజీ బుధవారం పరామర్శిం చారు. మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. జీకే నాయుడు, బావన దుర్యోధన, రట్టి లింగరాజు పాల్గొన్నారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు

టెక్కలి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మన సంస్కృతి..సంప్రదాయాల్లో భాగంగా అంధ్రప్రదేశ్ అమెరికన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలను ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ పోటీలు ఇంటి లోగిలి వద్దే వేసే అవకాశం కల్పించారన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఎటువంటి ప్రవేశ రుసుం లేదని, అన్ని ఎంట్రీలు డిసెంబరు ఒకటి నుంచి జనవరి 15 వరకు అందించాలని, ముగ్గులు వేసేందుకు నచ్చిన ప్రదేశాన్ని ఎంచుకోవచ్చన్నారు. ఎంపికైన వంద ఎంట్రీలకు ఏ-గ్రేడ్ సర్టిఫికేట్, ట్రోఫీతో పాటు బహుమతులు అందించనున్నామన్నారు. ఇతర వివరాల కోసం కిల్లి కృపారాణి కార్యాలయం, టెక్కలిలో సంప్రదించాలని ఆమె కోరారు. అంతకుముందు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ రంగవల్లికల పోటీలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ కిల్లి రామ్మోహనరావు, పేడాడ పరమేశ్వరరావు, సనపల అన్నాజీ, టీబీజీ గుప్త తదితరులు పాల్గొన్నారు.

దళితుల శ్మశాన వాటికలకు రోడ్లు ఏర్పాటు చేయండి

టెక్కలి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో దళితుల శ్మశాన వాటికలకు రోడ్లు నిర్మించాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యులు బోకర నారాయణరావు, బెలమర ప్రభాకర్, గేదెల రమణమూర్తి కోరారు. బుధవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి అధ్యక్షతన డివిజన్ స్థాయి విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. పోలీస్‌స్టేషన్లలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదులో తాత్సారం వహిస్తున్నారని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలోని సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహంలో మెనూ అమలులో లోపాలున్నాయని సూచించారు. ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని కోరారు.

మత్స్యకారులు ఉత్పత్తిదారుల సమాఖ్యగా ఏర్పడాలి

సంతబొమ్మాళి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వడ్డితాంధ్ర శ్రీ జగన్నాథ మత్స్య సహకార సంఘ సభ్యులు ఉత్పత్తి దారుల సమాఖ్య ఏర్పడాలని టెక్కలి మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ధర్మరాజు పాత్రో అన్నారు. బుధ వారం వడ్డితాంధ్రలో సొసైటీ అధ్యక్షుడు నాగేశ్వరి పద్మనాభం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.

మత్స్యకారులకు గుర్తింపు కార్డులు

వజ్రపుకొత్తూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి మత్స్యకార కిషన్ యోజన (ఎన్‌డీఎప్ఏ)లో భాగంగా మత్స్యకారులకు గుర్తింపు కార్డులను అందిస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని మండల మత్స్యశాఖాధికారి కె.నాగరాజు అన్నారు. బుధవారం నువ్వల రేవులో మత్స్యకారులకు ఈ కార్డులను అందించారు. మరిన్ని వివరాలకు 70136 50113 నెంబరులో సంప్రదించాలన్నారు.

కోర్టు వాయిదాకు హాజరైన 'కలమట'


కోర్టుకు హాజరైన కలమట వెంకటరమణ, సాగర్

కొత్తూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు కోర్టు వాయిదాకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ 18 మంది కార్యకర్తలతో కలిసి బుధవారం హాజర య్యారు. వైసీపీ ప్రభుత్వంలో మాతల పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ భవనాలకు వైసీపీ రంగులు వేస్తున్న సందర్భంగా నిరసన తెలి పారనే అభియోగంతో 19 మంది టీడీపీ నాయకులపై అక్రమంగా కేసులు పెట్టారు. దీంతో ఈ కేసులో వాయిదాకు కలమట రమణతో పాటు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్ తదితరులు హాజరయ్యారు.

పనులను నాణ్యతతో చేపట్టాలి: పీవో


పనులను వివరాలను పరిశీలిస్తున్న పీవో యశ్వంత్ కుమార్ రెడ్డి

కొత్తూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న మల్టీపర్పస్ కేంద్రాల భవన నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలని పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాయల పంచాయతీ ఎర్రటిగూడ గ్రామంలో నిర్మాణంలో ఉన్న మల్టీపర్పస్ భవన నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈ సీహెచ్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా తెప్పోత్సవం



నరసన్నపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం బహుళ ద్వాదశిని పురస్కరించుకుని స్థానిక గడ్డెయ్యచెరువులో బుధవారం రాత్రి ఉమారామలింగేశ్వర స్వామి తెప్పోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి ఉత్సవమూర్తులకు తిరువీధి నిర్వహించి అనంతరం తెప్పోత్సవం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ

టెక్కలి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక తెలుగు బ్రాహ్మణవీధిలో బుధవారం రాత్రి అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహించారు. అష్టాదశ సోపానాలు, అష్టాదశ ద్రవ్యాలతో స్వామికి అభిషేకం, పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణాన్ని పూలతో అందంగా తీర్చిదిద్దారు.

తెగిపడిన 11కేవీ విద్యుత్ తీగెలు

టెక్కలి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): టెక్కలి మేజర్‌పంచాయతీ గోపినాథపురం సమీపంలో బుధవారం 11 కేవీ విద్యుత్ తీగెలు తెగిపడడంతో పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సమీపంలోని బాదంచెట్టు కొమ్మలు పడడంతో తీగెలు తెగిపడ్డాయి. అయితే ఈ సమయంలో ఎటువంటి ప్రమాదం చోటుచేసుకోలేదు. గోపినాథపురం, కోదండరామవీధి, బీసీ కాలనీ, మెయిన్‌రోడ్డు, చిన్నబజారు, కచేరివీధి తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సిబ్బంది యుద్ధప్రాతిపదిన మరమ్మతులు చేశారు.

కాంగ్రెస్ నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా 'మామిడి'



జలుమూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నరసన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్‌గా మామిడి సత్యనారాయణను నియమిస్తూ పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి కోఆర్డినేటర్‌గా నియమించిన పీసీసీ అధ్యక్షురాలికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

న్యూస్ బాక్స్

మత్స్యకారులను కాపాడిన అధికారులకు అభినందన

కోటబొమ్మాళి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి 35 కిలోమీటర్ల దూరంలో కృష్ణపట్నం పోర్టుకు సమీపంలో సముద్రంలో నిలిచి పోయిన మత్స్యకారుల బోటును సురక్షితంగా తీసుకువచ్చిన అధికా రులను రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకనటలో అభినందించారు. బుధవారం ఉదయం నుంచి యుద్ధప్రాతిపదికన చేపట్టిన చర్యలు ఫలించి బోటులో చిక్కుకున్న 9 మంది మత్స్యకారులను సురక్షితంగా ఒడ్డుకు తీసుకువచ్చేందుకు కృషి చేసిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంటేశ్వర్, కృష్ణపట్నం మెరైన్ హెడ్ కెప్టెన్ రజత్, ఇతర అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

పీఎంఏవైని సద్వినియోగం చేసుకోండి

పలాసరూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎం ఏవై) పథకాన్ని లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని సోషల్ డెవలప్‌మెంట్ అధికారి సీహెచ్ మల్లేశ్వరరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళా సంఘ సభ్యులకే ఈ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటివరకు ఇంటిని పొంది నిర్మాణం చేపట్టని వారు త్వరితగతిన చేపట్టా లని, బిల్లులు జాప్యం లేకుండా అందజేస్తున్నందున ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామైక్యసంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వ్యసనాల బారిన పడొద్దు

పాతపట్నం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వ్యసనాల బారిన పడవద్దని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.రామారావు అన్నారు. స్థానిక బీసీ బాలుర సంక్షేమ వసతిగృహంలో 'సంకల్పం'లో భాగంగా సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల నియంత్రణలపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయిని తీసుకున్నా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి వల్ల అనారోగ్యం బారిన పడి జీవితాలు ఛిద్రమవుతాయన్నారు. సైబర్ నేరగాళ్లబారిన పడి ఆన్‌లైన్ మోసాలకు గురికావద్దన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, వసతిగృహ అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా..

సంతబొమ్మాళి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నౌపడ ఎస్ఐ నారాయణస్వామి అన్నారు. బుధవారం మర్రిపాడులో 'సంకల్పం'లో గ్రామస్థులకు సైబర్ నేరాలు, మారకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు.

ఇష్టపడి చదివాలి

వజ్రపుకొత్తూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇష్టపడి చదివి మంచి ఫలితాలు ఆధించాలని పొందవచ్చునని ఎస్ఐ బి.నిహార్ అన్నారు. 'సంకల్పం'లో భాగంగా బుధవారం పాతటెక్కలి హైస్కూల్‌లో వివిధ అంశాలపై అవగాహన కలిగించారు. విద్యార్థి దశ చాలా విలువైనదని, ఈ దశలో చెడు అలవాట్లకు గురికావద్దన్నారు. మంచి అలవాట్లతో క్రమశిక్షణతో చదువుకుని ఇటు పాఠశాల, అటు తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలన్నారు. సమాజంలో ఆదర్శంగా మెలగాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

2న ఆకాశవాణిలో గౌరీశంకర్ కథ

నరసన్నపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నరసన్నపేటకు చెందిన కథా రచయిత భమిడిపాటి గౌరీశంకర్ కథ 'మబ్బు చాటు వాన చినుకు' కథ వచ్చే నెల 2న విశాఖపట్నం ఆకాశవాణి (ఏఐఆర్)లో ప్రసారం కానున్నట్లు సమాచారం వచ్చిందని ఆయన తెలిపారు. ఈయన ఇంతవరకు 100కు పైగా కథలు, సాహిత్య వ్యాసాలు, ఏడు సంకలనాలు వెలువరించారు. అనేక జాతీయ, అంతర్జాతీయ సదస్సులకు సభా నిర్వాహకుడిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా గౌరీశంకర్‌ను పలువురు సాహితీ వేత్తలు అభినందించారు.

'పది' విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

నరసన్నపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నానికి చెందిన జుత్తు జగ్గన్న మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ప్రతినిదులు బుధవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో పదో తరగతి విద్యార్థులకు గాను స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. వీటిని ఎంఈవోలు ఉన్నత పాఠశాలల హెచ్ఎంలకు పంపిణీ చేశారు. జిల్లాలో 20 మండలాల్లో చదివే విద్యార్థులకు రూ.8 లక్షల విలువైన స్టడీ మెటీరియల్‌ను అందించడంపై ఎంఈవో ఉప్పాడ శాంతారావు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

వ్యవసాయ సూచనల కోసం 'పాడిపంటలు': జేడీఏ

పోలాకి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వ్యవసాయం చేసే రైతులు మెలకువలు తెలుసుకునేందుకు ప్రభుత్వం 'పాడి పంటలు' పేరుతో పుస్తకాన్ని రూపొందించిం దని వ్యవసాయశాఖ జేడీ కె.త్రినాథ స్వామి తెలిపారు. బుధవారం ఆయన పోలాకి పీఏసీఎస్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. రబీ కాలానికి 1.90 లక్షల ఎకరాల్లో సాగు విస్తీర్ణం లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ఖరీఫ్‌లో 9652 క్వింటాళ్ల ధాన్యం సేకరించేందుకు ప్రణాళికలు తయారుచేశామన్నారు. జిల్లాలో 620 రైతుసేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. రబీ పంటలకు వీలుగా పెసర, మినుగు, వేరుశనగ విత్తనాలను రాయితీపై అందజేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.